కథ

# మత్తు

—నవీన్





"ఈ విషయం నీకు తెలుసా?" అన్నాడు దేవేందర్ ఫోన్ చేసి.

"ఏ విషయం?" అన్నాను.

"మన ప్రొఫెసర్ శంకరనారాయణ గార్కి బ్రెయిన్‌లో ట్యూమర్ ఫార్మయిందట. వారం రోజుల క్రితం ఆపరేషన్ చేసి దాన్ని తీసేశారట. ప్రొఫెసర్ గారి భార్య రాత్రి బెంగుళూరు నుండి ఫోన్ చేసి నాకీ సంగతి చెప్పింది" అన్నాడు దేవేందర్.

"అలాగా! ప్రొఫెసర్‌గారు ఇప్పుడెలా ఉన్నారో?" అన్నాను.

"ఇప్పుడు బాగానే ఉన్నారట... ఇంకా హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ కాలేదట... మనం ఒకసారి వెళ్ళి వారిని చూసొస్తే బావుంటుందేమో!"

"ఎక్కడికి? బెంగుళూరుకే."

"అవును —బెంగుళూరుకే —ఆయనుండేది బెంగుళూరులోనే కదా!"

"అవుననుకో... కానీ అంతదూరం వెళ్ళాలంటే కొంచెం ముందుగా ప్లాన్ చేసుకోవాలి కదా"

"బెంగుళూరు ఏమంత దూరమనీ? మన హనుమకొండ నుండి బెంగుళూరుకు డైరెక్ట్ బస్సుంది. ఇక్కడ సాయంత్రం బస్సులో కూర్చున్నామంటే తెల్లారేకల్లా బెంగుళూరులో ఉంటాం —ప్రొఫెసర్‌గార్ని చూసి అక్కడ్నించి సాయంత్రం బయల్దేరే బస్సులో ఇక్కడ కొచ్చేద్దాం. ఓ రెండ్రోజులు సి.ఎల్. పడేస్తే సరిపోతుంది."

"నీ ప్లాన్ బాగానే ఉంది కానీ అంతదూరం బస్సులో వెళ్ళాలంటే కష్టమే!"

"ఏం కష్టం లేదు. ఇప్పుడిక్కడ్నుంచి బెంగుళూరుకు హైటెక్ బస్సు వేశారు. జర్నీ చాలా కంఫర్టబుల్‌గా ఉంటుంది. యూ నీడ్ నాట్ వర్రీ."

"సరే అయితే... ఎప్పుడు వెళ్దామంటావు?"

"రేపే వెళ్దాం. రేపు సాటర్ డే కాబట్టి మనకు సన్‌డే కూడా కలిసొస్తుంది. నేనీ రోజు బస్సు స్టేషన్‌కు వెళ్ళి రేపటికి బెంగుళూరు బస్సులో మనకు రెండు సీట్లు రిజర్వ్ చేయిస్తాను. రేపు సాయంత్రం మూడున్నరకు నువ్వు బస్సు స్టేషన్ కొచ్చేయ్."

"అలాగే" అంటూ నేను ఫోన్ పెట్టేశాను.

మేం కాలేజీలో బి.ఏ. చదువుతున్న రోజుల్లో మాకు ప్రొఫెసర్ శంకరనారాయణ ఇంగ్లీషు చెప్పేవాడు. ఆయన పాఠం చెప్పే పద్ధతి అద్భుతంగా, అనితరసాధ్యమనిపించేలా ఉండేది. ఆయన నోటివెంట ఇంగ్లీషు భాష ఒక మహా ప్రవాహంలా వెలువడేది. పదాల కోసం ఒక్క క్షణం కూడా తడుముకునే వాడు కాదు. ఎంత సంక్లిష్టమైన విషయాన్నైనా ఆయన అరటి పండు ఒలిచి చేతిలో పెట్టినంత సులభంగా, సూటిగా, స్పష్టంగా చెప్పేవాడు —చాలా త్వరలోనే మే మిద్దరం ఆయనకు అత్యంత ప్రియమైన శిష్యులంగా మారిపోయాం. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం ఆయనతో ఏర్పడిన ఈ అనుబంధం ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. ప్రొఫెసర్ శంకరనారాయణ ఉస్మానియా యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్‌గా రిటైర్ అయిపోయాక తన సొంత ఊరు బెంగుళూరుకు వెళ్ళి అక్కడే సెటిలైపోయారు. ఆయన రిటైరయ్యాక మేమిద్దరమూ బెంగుళూరు వెళ్ళి ఆయన్ని కలిసొచ్చాం కూడా.

★ ★ ★

ఆ మర్నాడు సాయంత్రం మూడున్నరకు మేమిద్దరం బస్సు స్టేషన్‌లో కలుసుకున్నాం.

హైటెక్ బస్సు పది నిమిషాలు ముందుగానే వచ్చింది. ప్రయాణీకుల్లో ఎక్కువమంది ముందుగానే సీట్లు రిజర్వ్ చేయించుకున్నారు కాబట్టి అందరూ నెమ్మదిగానే ఒకరి తర్వాతొకరు బస్సులో ప్రవేశించారు.

"మన సీటు నెంబర్లు ఇరవై మూడు, ఇరవై నాలుగు" అన్నాడు దేవేందర్.

"అబ్బో! అయితే చాలా వెనకే" అంటూ మా సీట్లని వెతుక్కొని వాటి మీద కూర్చుండిపోయాం.

నాలుగైదు నిముషాల్లోనే బస్సు పూర్తిగా నిండిపోయింది.

సరిగ్గా నాల్గింటికి బస్సు కదిలింది.

కండక్టర్ ఒక్కొక్కరి దగ్గరకొచ్చి టిక్కెట్లు చెక్ చేస్తూ, రిజర్వేషన్ చేయించుకోని కొందరు ప్రయాణీకులకు టిక్కెట్లు ఇస్తూ మా దగ్గరకొచ్చాడు. దేవేందర్ పర్సు తీసి టిక్కెట్ల కోసం చూశాడు —పర్సులో టిక్కెట్లు లేవు.

"అరె! పర్సులోనే పెట్టానే —కనిపించటం లేదేమిటి?" అన్నాడు దేవేందర్.

"తొందరపడకు... జాగ్రత్తగా చూడు" అన్నాన్నేను.

దేవేందర్ చాలాసేపు పర్సుతో పాటు తన జేబులన్నీ వెతికి చూశాడు —కానీ టిక్కెట్స్ లేవు.

"పర్సులో టిక్కెట్స్ నువ్వే పెట్టావా?" అడిగాను.

"లేదు —మా మిసెస్ పెట్టింది. పెడ్తున్నానని చెప్పింది కూడా" అన్నాడు దేవేందర్.

"అయితే ఇక వాటిమీద ఆశ వదులుకో" అన్నాను.

అప్పటికే బస్సు సిటీ అవుట్‌స్కర్ట్స్ దాటి హైదరాబాద్ హైవే మీద వేగంగా వెళ్తోంది.

ఇప్పుడేమవుతుంది? కండక్టర్ మమ్మల్నిద్దర్నీ బస్సులో నుంచి దింపేస్తాడా? టిక్కెట్స్ గురించి ఇంత అశ్రద్ధగా ఉన్న దేవేందర్ మీద కోపమొచ్చింది. టిక్కెట్స్ లేని కారణంగా బస్సులోంచి దింపేశారంటే తల కొట్టేసినట్టుగా ఉంటుంది.

దేవేందర్ సూట్‌కేసు కూడా తెరిచి టిక్కెట్ల కోసం వెతికి ఇక టిక్కెట్లు దొరకవనీ, వాటిని ఇంట్లోనే మరిచి పోయొచ్చానని తేల్చేశాడు.

"ఏమయింది సార్! టిక్కెట్లు దొరికినయా?" అంటూ కండక్టర్ బస్సంతా చెక్ చెయ్యడం పూర్తి చేసుకొని మా దగ్గర కొచ్చాడు.

"సారీ కండక్టర్! టిక్కెట్స్‌ని నేను ఇంట్లోనే మరిచిపోయి వచ్చాను" అన్నాడు దేవేందర్.

"అయితే దిగిపోండి సార్! అన్నీ తెలిసినోళ్ళు మీరే గిట్ల చేస్తే ఎట్ల సార్!" అన్నాడు కండక్టర్.

బస్సులో కూర్చున్న ప్రయాణీకులందరూ మా వైపే చూడసాగారు.

"మేం టిక్కెట్స్‌ని ముందే రిజర్వ్ చేయించుకున్నాం కాబట్టి ఆ టిక్కెట్ నెంబర్స్‌ని రిజర్వేషన్ కౌంటర్ వాళ్ళు మీ కిచ్చే ఉంటారు. మీ దగ్గరున్న రిజర్వేషన్ చార్ట్ నొకసారి చూడండి" అన్నాడు దేవేందర్.

"బాగా జూసిన సార్! ఇగో ఈ రెండు సీట్ల టిక్కెట్స్ తప్ప మిగతావన్నీ చెకయిపోయినయి. కాబట్టి ఈ రెండు టిక్కెట్లు మీయే కావొచ్చు. కానీ మీ దగ్గర టిక్కెట్లు లేనప్పుడు నేనేం జెయ్యాలె. టిక్కెట్లు మల్ల కొనుక్కోండ్రి" అన్నాడు కండక్టర్.

టిక్కెట్లు మళ్ళీ కొనుక్కోవడమంటే ఆరు వందల రూపాయల్ని వట్టి పుణ్యానికి పోగొట్టుకోవడమన్న మాట!

"చూడు కండక్టర్! నీ దగ్గర రిజర్వేషన్ చార్ట్ ఉంది. దాంట్లో మా టిక్కెట్ నెంబర్స్ ఉన్నాయి. దాన్ని బట్టి మేం టిక్కెట్స్ తీసుకున్నట్టుగా రుజువయింది. టైమయి పోయిందన్న హడావుడిలో మావాడు టిక్కెట్స్‌ని పర్సులో పెట్టుకోవడం మరిచిపోయాడు. మే మిద్దరం యూనివర్సిటీలో రీడర్స్‌గా పనిచేస్తున్నాము. ఓ అర్జంట్ పనిమీద బెంగుళూరు వెళ్తున్నాము. ఇప్పుడు నువ్వు మమ్మల్ని మళ్ళీ టిక్కెట్స్ తీసుకొమ్మంటే ఎలా

